**25 October, 2026 – 30th Sunday in Ord. Time (A Cycle)**

*Ex 22:20–26; 1 Thess 1:5c–10; Mt 22:34–40*

**25 అక్టోబరు, 2026 – సాధారణ కాలంలోని 30వ ఆదివారం (ఎ సైకిల్)**

**నిర్గమకాండము 22:20–26; 1 థెస్సలొనీకయులకు 1:5సి–10; మత్తయి 22:34–40**

## ప్రవేశిక

ఒకసారి ఒక ప్రయాణికుడు ఓ వృద్ధ సన్యాసిని అడిగాడు: "జీవితంలో అత్యంత ముఖ్యమైనది ఏమిటి?"

ఆ సన్యాసి వెంటనే సమాధానం చెప్పలేదు. బదులుగా, అతడు ఆ ప్రయాణికుణ్ణి ఒక బావి దగ్గరకు తీసుకెళ్లి, బకెట్‌తో నీళ్లు తీసి అతనికి త్రాగమని ఇచ్చాడు. దాహంతో ఉన్న ఆ ప్రయాణికుడు కడుపారా నీరు తాగాడు.

అప్పుడు ఆ సన్యాసి చిరునవ్వుతో ఇలా అన్నాడు: "నీకు దాహంగా ఉన్నప్పుడు, నీళ్లకంటే ముఖ్యమైనది మరొకటి లేదు. అలాగే ఆత్మకు దాహంగా ఉన్నప్పుడు, ప్రేమకంటే ముఖ్యమైనది మరొకటి లేదు."

ఈ రోజు యేసు మనకు అత్యంత ముఖ్యమైనది ఏమిటో చెబుతున్నారు: మన పూర్ణ హృదయంతోను, పూర్ణ ఆత్మతోను, పూర్ణ మనస్సుతోను దేవుణ్ణి ప్రేమించాలి; అలాగే మనలాగే మన పొరుగువారిని ప్రేమించాలి. క్రైస్తవ జీవితంలోని ప్రతిదీ ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది. విశ్వాసం అనేది మొదట నియమాలు లేదా ఆచారాల గురించి కాదు; మనలను ముందుగా ప్రేమించిన దేవునితో మనకు ఉండే సజీవ సంబంధం గురించి.

దేవుడు మనలను ప్రేమిస్తున్నాడని నిజంగా తెలుసుకున్నప్పుడు మన హృదయాలు మారడం ప్రారంభమవుతుంది. ప్రార్థన మరింత జీవంతో నిండుతుంది. దయ సహజంగా మారుతుంది.

క్షమించడం మరింత సాధ్యమవుతుంది. సాధారణమైన పనులు కూడా దేవుని కృపకు గుర్తులుగా మారతాయి. ప్రేమ అనేది జీవితంలోని మిగతా అన్నింటినీ సరైన స్థానంలో ఉంచే "మొదటి గుండీ" వంటిది.

అయితే, క్రీస్తు మనలను ప్రేమించమని పిలిచిన విధంగా మనం ఎల్లప్పుడూ ప్రేమించలేమని మనకు తెలుసు. దేవుణ్ణి పూర్ణ హృదయంతో ప్రేమించడంలో మనం విఫలమవుతాం. ఇతరులను ఉదారంగా ప్రేమించడంలో కూడా విఫలమవుతాం. కొన్నిసార్లు దేవుడు మనపై చూపుతున్న ప్రేమను స్వీకరించడంలో కూడా వెనుకబడిపోతాం. కాబట్టి, వినయపూర్వక హృదయాలతో మన పాపాలను అంగీకరించి, ప్రభువు నుండి కరుణను, స్వస్థతను వేడుకుందాం.

## ప్రసంగం

ఒక ఉపాధ్యాయురాలు తన విద్యార్థులను, "సంతోషకరమైన జీవితానికి అత్యంత ముఖ్యమైన నియమం ఏమిటి?" అని అడిగి, దానిని వ్రాయమంది.

ఒక బాలుడు, "ఎల్లప్పుడూ నిజం చెప్పాలి" అని వ్రాశాడు.

మరోకరు, "కష్టపడి పని చేయాలి" అని వ్రాశాడు.

ఇంకొకరు, "దయగా ఉండాలి" అని వ్రాశాడు.

కానీ ఒక చిన్న బాలుడు మాత్రం, "ముందుగా ప్రేమించు" అని మాత్రమే వ్రాశాడు.

ఆ ఉపాధ్యాయురాలు, "దాని అర్థం ఏమిటి?" అని అడిగినప్పుడు, అతడు ఇలా చెప్పాడు: "ముందుగా ప్రేమిస్తే, మిగతా విషయాలన్నీ సులభమవుతాయి."

ఆ చిన్న బాలుడికి తెలియకుండానే, ఈ రోజు సువార్త యొక్క హృదయాన్ని అతడు అర్థం చేసుకున్నాడు.

పరిసయ్యులు యేసును ఒక చాలా గంభీరమైన ప్రశ్న అడుగుతారు:

“గురువర్యా, ధర్మశాస్త్రంలో గొప్ప ఆజ్ఞ ఏది?”

యేసు ప్రతి యూదునికీ కంఠస్థమైన మాటలతో సమాధానం ఇస్తారు:

“నీ పూర్ణ హృదయంతోను, నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణ మనస్సుతోను నీ దేవుడైన ప్రభువును ప్రేమించుము.”

ఆ తరువాత ఇంకొక ఆజ్ఞను చేర్చారు:

“నీ పొరుగువానిని నిన్ను నీవు ప్రేమించుకున్నట్లే ప్రేమించుము.”

అనంతరం యేసు ఆశ్చర్యపరిచే మాట చెప్పారు:

“ఈ రెండు ఆజ్ఞలపైనే ధర్మశాస్త్రమంతయు, ప్రవక్తల బోధ అంతయు ఆధారపడి ఉంది.”

అంటే, ప్రతిదీ ప్రేమపైనే ఆధారపడి ఉంది.

ఒక యాజకుడు దీనిని చొక్కాకు గుండీలు పెట్టుకోవడంతో పోల్చాడు.

చిన్నతనంలో, ఉదయం తొందరలో అతడు తరచూ చొక్కాకు గుండీలు తప్పుగా పెట్టుకునేవాడు. మొదటి గుండీ తప్పు కన్నంలోకి వెళితే, తరువాతి గుండీలన్నీ కూడా తప్పుగానే పడేవి. అప్పుడు చొక్కా వంకరగా ఉండి అసౌకర్యంగా అనిపించేది.

అతని తల్లి ఎప్పుడూ ఇలా చెప్పేది:

“మొదటి గుండీ మీద శ్రద్ధ పెట్టు. మొదటిది సరిగ్గా ఉంటే, మిగతావన్నీ వాటంతట అవే సరిగ్గా పడతాయి.”

ఈ రోజు యేసు కూడా సరిగ్గా ఇదే విషయాన్ని చెబుతున్నారు.

**ప్రేమ అనేది క్రైస్తవ జీవితంలోని “మొదటి గుండీ.” ప్రేమ సరిగ్గా ఉంటే, మిగతా ప్రతిదీ క్రమంగా తన సరైన స్థానాన్ని పొందుతుంది.**

**ప్రేమ లేకపోతే, మతం ఒక భారంగా మారుతుంది. ప్రార్థన ఒక యాంత్రిక అలవాటుగా మారుతుంది. ఆరాధన ఒక బాధ్యతగా మాత్రమే మిగులుతుంది. నైతిక జీవితం చల్లని నియమాల సమాహారంగా మారుతుంది.**

**కానీ ప్రేమ ఉన్నప్పుడు, విశ్వాసం సజీవమవుతుంది.**

ప్రేమ అనేది మనలను మార్చివేస్తుంది.

పరిశుద్ధులు ఈ సత్యాన్ని బాగా అర్థం చేసుకున్నారు. ఒకసారి పరిశుద్ధ అగస్టీను ఇలా అన్నారు: **“ప్రేమించు; ఆ తరువాత నీకు అనిపించినది చేయి.”** దీనర్థం ఏది చేసినా పరవాలేదని కాదు. ఆయన ఉద్దేశం ఏమిటంటే, హృదయం నిజంగా దేవుణ్ణి ప్రేమించినప్పుడు, మన నిర్ణయాలు, మన జీవితం సరైన దిశలో ప్రవహించడం ప్రారంభమవుతుంది.

అయితే ఇక్కడ మనం ఒక నిజాయితీగల ప్రశ్న అడగవచ్చు: **యేసు ప్రేమించమని ఎలా ఆజ్ఞాపించగలరు? ప్రేమను నిజంగా ఆజ్ఞాపించగలమా?**

ఒక తల్లి తన బిడ్డను తనను ప్రేమించమని బలవంతం చేయలేను. ఒక భర్త తన భార్య నుండి ప్రేమను బలవంతంగా పొందలేడు. ప్రేమ అనేది విద్యుత్ దీపంలా ఒక స్విచ్ నొక్కగానే వెలిగిపోయేది కాదు.

అందుకే పరిశుద్ధ యోహాను మనకు తాళంచెవి లాంటి ఒక గొప్ప సత్యాన్ని చెబుతున్నారు:

**“ఆయన మనలను మొదట ప్రేమించారు కాబట్టి మనమూ ప్రేమిస్తున్నాము.”**

క్రైస్తవ జీవితం మనం దేవుణ్ణి ప్రేమించడం ద్వారా ప్రారంభం కాదు. దేవుడు ముందుగా మనలను ప్రేమించడం ద్వారానే అది ప్రారంభమవుతుంది.

చాలామంది పవిత్రత అంటే మరింత కష్టపడటం, మరింత ప్రయత్నించడం అని అనుకుంటారు. కానీ సువార్త మనకు మరింత లోతైన సత్యాన్ని బోధిస్తుంది. పవిత్రత అనేది దేవుడు మనలను ప్రేమించడానికి మన హృదయాలను తెరవడం ద్వారా ప్రారంభమవుతుంది.

ఒక యువతి కొంతకాలంగా చర్చికి వెళ్లడం మానేసింది. ఆమె తల్లి చాలా ఆందోళన చెందింది. అందుకే ఒక యాజకుణ్ణి ఆమెతో మాట్లాడమని కోరింది.

కొంతకాలానికి ఆ యువతి యువజన ఆధ్యాత్మిక శిబిరంలో పాల్గొంది. అక్కడ ఆమె క్రీస్తు ప్రేమను ఎంతో లోతుగా అనుభవించింది.

ఆ రోజు నుండి ఆమె దాదాపు ప్రతిరోజూ పవిత్ర బలికి హాజరవడం ప్రారంభించింది.

ఇంతకుముందు ఆదివారం బలి ఆమెకు విసుగుగా, అర్థంలేనిదిగా అనిపించేది. కానీ ఇప్పుడు అది తాను ప్రేమించే ఒక వ్యక్తిని కలుసుకునే పవిత్ర సమయంగా మారింది.

మారింది నియమం కాదు.

మారింది **ఆమెకు క్రీస్తుతో ఏర్పడిన వ్యక్తిగత సన్నిహిత అనుభవం.**

ఇలాంటిదే ఒకసారి ప్రథమ పవిత్ర ప్రసాద స్వీకరణ తరగతిలో కూడా జరిగింది.

ఆ యాజకుడు పిల్లలను ప్రతిరోజూ ఇలా ప్రార్థించమని ప్రోత్సహించాడు:

**“యేసయ్యా, నేను నిన్ను ప్రేమిస్తున్నాను.”**

అప్పుడు ఒక చిన్న బాలుడు కళ్లలో నీళ్లు తెచ్చుకొని బాధతో ఇలా అన్నాడు:

“నేను అలా చెప్పలేను. నాకు యేసు నిజంగా తెలియదు. తెలియని వ్యక్తిని నేను ఎలా ప్రేమించగలను?”

ఆ యాజకుడు ఎంతో జ్ఞానంతో ఇలా చెప్పాడు:

“అయితే ఒక వారం రోజుల పాటు ప్రతి రాత్రి ఇలా ప్రార్థించు:

**‘యేసయ్యా, నన్ను ప్రేమిస్తున్నందుకు నీకు కృతజ్ఞతలు.’”**

మూడో రోజుకే ఆ బాలుడు ఆనందంతో పరుగెత్తుకుంటూ యాజకుని వద్దకు వచ్చి ఇలా అన్నాడు:

“ఇప్పుడు నేనూ యేసును ప్రేమించగలుగుతున్నాను!”

ఇదే ఆధ్యాత్మిక జీవితంలోని గొప్ప రహస్యం.

దేవుడు మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో మనం ఎంత ఎక్కువగా తెలుసుకుంటామో, అంత ఎక్కువగా మనలో ప్రేమ పెరుగుతుంది.

ఒక ప్రాచీన క్రైస్తవ ధ్యాన రచనలో మానవ హృదయాన్ని ఎండిపోయిన స్పాంజితో పోల్చారు.

ఎండిపోయిన స్పాంజిని ఎంత బలంగా పిండినా, దానిలో నుంచి ఒక్క చుక్క నీళ్లు కూడా రావు.

కానీ దానిని నీళ్లలో ముంచి బాగా తడవనిస్తే, తరువాత దానిని పిండినప్పుడు నీరు సులభంగా బయటకు వస్తుంది.

అదేవిధంగా, భయం, కోపం, స్వార్థం, నిరాశల వల్ల ఎండిపోయిన హృదయం తనంతట తానే ప్రేమను ఉత్పత్తి చేయలేదు.

ముందుగా అది దేవుని ప్రేమలో పూర్తిగా మునిగిపోవాలి.

బహుశా ఇదే ఈ రోజు మన ప్రపంచం ఎదుర్కొంటున్న నిజమైన సంక్షోభం.

మన చుట్టూ విజయాలు ఉన్నాయి. సాంకేతిక పరిజ్ఞానం ఉంది. అపారమైన సమాచారం ఉంది. అయినప్పటికీ, అనేక హృదయాలు ప్రేమ కోసం ఆకలితో అలమటిస్తున్నాయి. ప్రజలు డిజిటల్ ద్వారా ఒకరితో ఒకరు అనుసంధానమై ఉన్నారు; కానీ ఆధ్యాత్మికంగా ఒంటరిగా జీవిస్తున్నారు. ఒకే

ఇంట్లో కుటుంబ సభ్యులు నివసిస్తున్నప్పటికీ, ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం కేటాయించడం లేదు. దేశాలు మరింత ధనవంతమవుతున్నాయి; కానీ సమాజాలు మరింత చల్లగా, నిర్జీవంగా మారుతున్నాయి.

అలాంటి ప్రపంచంలోకి యేసు అత్యంత ప్రాచీనమైనదీ, ఎల్లప్పుడూ నూతనమైనదీ అయిన ఈ ఆజ్ఞను పలుకుతున్నారు:

**“దేవుణ్ణి ప్రేమించు. నీ పొరుగువానిని ప్రేమించు.”**

మొదటి పఠనం ఈ ప్రేమ కేవలం భావోద్వేగం మాత్రమే కాదని మనకు గుర్తుచేస్తుంది. అది మన ప్రవర్తనలో కనిపించాలి. ముఖ్యంగా పరదేశి, వితంతువు, అనాథ, పేదవాడు వంటి బలహీనుల పట్ల మనం ఎలా ప్రవర్తిస్తున్నామో అందులో అది వ్యక్తమవుతుంది. దేవుని పట్ల ప్రేమను, మనుష్యుల పట్ల కరుణ నుండి వేరుచేయలేము.

యేసు మరొక సవాలుతో కూడిన మాటను కూడా జతచేస్తున్నారు:

**“నీ పొరుగువానిని నిన్ను నీవు ప్రేమించుకున్నట్లే ప్రేమించుము.”**

కొన్నిసార్లు ఈ ఆజ్ఞలోని చివరి భాగాన్ని మనం మరిచిపోతాము.

చాలామంది ఇతరులను ప్రేమించలేకపోవడానికి కారణం, వారి హృదయాల లోతుల్లో వారు తమను తాము అసహ్యించుకోవడమే. వారు గాయాలను, పశ్చాత్తాపాలను, అపరాధ భావాన్ని, సిగ్గును తమలో మోస్తూ ఉంటారు.

కానీ దేవుడు మనలను అసహ్యంతో చూడడు.

ఆయన మనలను కరుణతో చూస్తాడు.

ఒక వ్యక్తి ఆధ్యాత్మిక సలహా కోసం ఒక పురాతన మఠానికి వెళ్లాడు.

అతడు ఆ సన్యాసితో ఇలా అన్నాడు:

“నేను జీవితంలో ఎన్నోసార్లు విఫలమయ్యాను. నావంటి వ్యక్తిని దేవుడు ప్రేమించగలడని నేను అనుకోవడం లేదు.”

ఆ వృద్ధ సన్యాసి ఒక్క మాట కూడా మాట్లాడకుండా, ఒక పగిలిన మట్టి కప్పును తీసుకొని అందులో టీ పోశాడు.

ఆ వ్యక్తి ఆశ్చర్యంగా చూశాడు.

అప్పుడు ఆ సన్యాసి చిరునవ్వుతో ఇలా అన్నాడు:

“చూడు! పగిలిన కప్పు కూడా టీని పట్టుకోగలుగుతోంది. అలాగే పగిలిన హృదయం కూడా దేవుని కృపను స్వీకరించగలదు.”

ఇదే సువార్త అందించే శుభవార్త.

దేవుడు మనలను ప్రేమించడానికి, మనం ముందుగా పరిపూర్ణులం కావాలని ఎదురు చూడరు.

ఆయన ముందుగానే మనలను ప్రేమిస్తారు.

ఆ ప్రేమ క్రమంగా మన జీవితాలను మార్చివేస్తుంది.

కాబట్టి ఈ రోజు యేసు మనలో ప్రతి ఒక్కరినీ ఒకే ఒక విషయానికి ఆహ్వానిస్తున్నారు:

**మొదటి గుండీతో ప్రారంభించండి.**

దేవుడు మిమ్మల్ని ప్రేమించనివ్వండి.

ఆయనతో సమయం గడపండి.

మీ హృదయంలో ఉన్నదంతా నిజాయితీగా ఆయనతో పంచుకోండి.

ప్రార్థనలో, పవిత్ర గ్రంథ పఠనంలో, పవిత్ర యూకరిస్టులో ఆయనకు సన్నిహితంగా ఉండండి.

ఆ ప్రేమ నుండి మీ కుటుంబంలోకి, మీ పనిస్థలంలోకి, మీ పరిష్ సమాజంలోకి, అంతేకాక మీకు ఇష్టంలేని వారిపట్ల కూడా దయ, ప్రేమ ప్రవహించేలా చేయండి.

చివరిగా ఒక చిన్న సంఘటన.

ఒక చిన్న గ్రామంలో ఒకసారి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గ్రామమంతా చీకటిలో మునిగిపోయింది.

అప్పుడు ఒక వృద్ధ మహిళ ఒక కొవ్వొత్తి వెలిగించి, తన ఇంటి కిటికీ దగ్గర ఉంచింది.

దానిని చూసిన పొరుగువారు తమ తమ కొవ్వొత్తులను ఆమె కొవ్వొత్తి నుండి వెలిగించుకున్నారు.

ఒక చిన్న జ్యోతి అనేక జ్యోతులుగా విస్తరించింది.

బయట ఉన్న చీకటి వెంటనే తొలగిపోలేదు.

కానీ కొద్దికొద్దిగా గ్రామమంతా వెలుగుతో నిండిపోయింది.

క్రైస్తవ ప్రేమ కూడా అలాంటిదే.

మనమే వెలుగును సృష్టించము.

ఆ వెలుగును మనం క్రీస్తు నుండి స్వీకరిస్తాము.

ఆ తరువాత దానిని ఇతరులకు పంచుతాము.

**“నీ దేవుడైన ప్రభువును ప్రేమించుము… నీ పొరుగువానిని నిన్ను నీవు ప్రేమించుకున్నట్లే ప్రేమించుము.”**

ఈ రెండు ఆజ్ఞలపైనే సమస్తం ఆధారపడి ఉంది.

**ఆమెన్.**